ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- పేదల జీవితంలో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొనారు.
- రైతుల సౌకర్యార్థం రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఎరువుల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారు.
- ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె. విజయానంద్ ఈరోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు.
- ప్రజలందరూ నిబంధనలను పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ విజ్ఞప్తి చేశారు.

======================

ప్రజల మధ్య ఉంటూ వారి బాగోగులను చూసుకోవడమే తన బాధ్యత అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈరోజు ఆయన పల్నాడు జిల్లా యలమందలో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పేదల జీవితంలో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమని, పేదరికం లేని సమాజమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి లబ్ధిదారునికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పింఛను అందాలని, లబ్ధిదారుల ఇళ్ళ వద్ద కాకుండా, కార్యాలయాల్లో పింఛను ఇస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైట్ - ముఖ్యమంత్రి (వాయిస్ బైట్..28 సెకన్లు)

======================

రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ రోజు గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డును పరిశీలించారు. రైతులతో ముఖాముఖిలో పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల పంపిణీ సరిగా జరగడం లేదని రైతులు మంత్రికి తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి... ఈరోజు సాయంత్రం 5 గంటల సమయానికి రైతులకు ఎరువులు అందచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అనేక ప్రాంతాల్లో ఎరువుల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రభుత్వం తరుపున ప్రతి ఒక్క రైతుకి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

======================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె. విజయానంద్ ఈరోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ఆయన ఈరోజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జి.సాయి ప్రసాద్, యం.టి.కృష్ణబాబు, టిటిడి ఇ.ఓ. శ్యామలరావు, జిఏడి కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, తదితరులు నూతన సీ.ఎస్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

======================

నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జరుపుకోవాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీశ్ సూచించారు. నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగరాదన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని చెప్పారు. ప్రజలందరూ నిబంధనలను పాటించాలని, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బహిరంగ ప్రదేశాల్లో రోడ్లపై ఎటువంటి వేడుకలకూ అనుమతి లేదని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల తర్వాత వాహనాల తనిఖీలు చేపడతామని, మద్యం సేవించి వాహనాలను నడపినట్లయితే తీవ్రంగా పరిగణిస్తామని ఎస్పీ హెచ్చరిస్తూ...

బైట్ – ఎస్పీ (వాయిస్ బైట్..40 సెకన్లు)

=======================

సామాజిక భద్రతా పెన్షన్ల ద్వారా ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ప్రభుత్వం విధానాలను సరళీకృతం చేసిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈరోజు ఆయన ఏలూరు జిల్లా చాట్రాయి, సోమవరం గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఇప్పటివరకు లక్ష ఇళ్లు పూర్తయ్యాయని, మార్చి నాటికి మరో 50 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామని చెప్పారు. ఇప్పటికే పూర్తయిన లక్ష గృహాలకు త్వరలో గృహ ప్రవేశాలు నిర్వహించి లబ్ధిదారులకు, ఇంటి తాళాలు అందిస్తామని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

=======================

అల్లూరి సీతారామరాజు జిల్లా జి. మాడుగుల మండలం గాంధీనగర్ లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని అత్యాచార ఘటనపై రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ శంకరరావు ఆందోళన వ్యక్తం చేసారు. విద్యార్థిని అత్యాచార ఘటనకు సంబంధించి సమగ్ర నివేదికను అందజేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని, పాఠశాల సిబ్బంది బాధ్యతగా ఉండాలని చెప్పారు. అత్యాచార ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని చైర్మన్ ఆదేశించారు.

=======================

విరామం

=======================

సామాజిక పెన్షన్లను దేశంలోనే అత్యధికంగా మన రాష్ట్రంలో ఇస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం రూరల్ మండలం జొన్నవలస, బొబ్బాదిపేట ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛను పంపిణీ కార్యక్రమాల్లో ఈరోజు ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క నెల పింఛను తీసుకోకపోయినా ఆ మొత్తం రద్దయ్యేదని, ఉపాధికోసం వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని మూడు నెలల పింఛను ఒకేసారి తీసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. ఈ నెలలో 80 వేల మందికి మూడు నెలల పింఛను మొత్తం ఒకేసారి అందిస్తున్నామన్నారు. అలాగే... భర్త మరణించిన వెంటనే అతని భార్యకు ఆ పింఛను మంజూరుచేసేలా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో 65 లక్షల మందికి ప్రతినెలా సామాజిక పింఛన్లు వారి ఇంటికే వెళ్లి అందిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్..27 సెకన్లు)

=======================

గడచిన సంవత్సర కాలంలో మహా విశాఖ నగర ప్రజలకు సంతృప్తికరమైన సేవలను అందించామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. రాబోయే కొత్త సంవత్సరంలో కూడా ప్రజల మన్ననలు పొందేలా పాలన అందిస్తామని తెలిపారు. 2024-25 సంవత్సరంలో జి.వి.ఎం.సి. పరిధిలో 185 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన 813 పనులకు గాను 18.19 కోట్లతో 197 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద నాలుగు ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు.

=======================

పార్వతీపురం మన్యం జిల్లాలోని షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల ప్రజలపై జరిగిన దాడుల కేసుల్లో బాధితులకు నష్ట పరిహారం త్వరగా చెల్లించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.వి.మాధవరెడ్డితో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి కేసును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకొని కేసుల విచారణ సమర్థవంతంగా నిర్వహించి త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు త్వరగా పరిహారం అందాలని, దీనిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలపై ఎటువంటి దాడులు జరగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటివరకు నమోదైన కేసుల్లో బాధితులకు నష్ట పరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

=======================

నూతన సంవత్సరంలో జిల్లాను రక్తహీనత నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యమని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈరోజు ఆయన పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేసి, 2024 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను, 2025 సంవత్సర నూతన ప్రణాళికలను తెలియజేశారు. రక్తహీనత నియంత్రణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించిందన్నారు. గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని, గర్భిణులను దత్తత తీసుకునేందుకు దత్తత అధికారులను నియమించామని తెలిపారు. గర్భిణీలలో రక్తహీనత ఎక్కువగా కనిపిస్తోందన్న కలెక్టర్... రక్తహీనతను నియంత్రించేందుకు స్వచ్ఛందంగా విరాళం ఇచ్చే వారికోసం “బాలిక శిశు అభివృద్ధి నిధి” ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా యంత్రాంగం విద్య, మాతాశిశు మరణాల నివారణ, గృహ నిర్మాణం, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిందని కలెక్టర్ వివరించారు.

=======================

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్. ఎం. డి. ఫరూక్ ఆకాంక్షించారు. నంద్యాల పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన పొదుపు లక్ష్మి మహిళల స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగంగా తయారు చేసిన వస్తువుల విక్రయ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

=======================
=======================